30 వరకు సన్న బియ్యం పంపిణీ

డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: మూడు నెలలకు ఒకేసారి సరిపడా సన్న బియ్యం పంపిణీ ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమం ఈ నెల 15వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని లబ్ధిదారులు కంగారు పడొద్దని అన్నారు. ఈ విషయాన్ని రేషన్ కార్డు దారులు గమనించాలని డీఎస్‌ఓ పేర్కొన్నారు.

ఆలయంలో సుదర్శన హోమం



సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సుదర్శన, నరసింహ, లక్ష్మి ధన్వంతరి హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి రామాచారి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ హోమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మందిర నిర్మాణ పూజలు



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని షిరిడీ హిల్స్ నాగసాయి మందిర ఆవరణలో ఆదివారం సీతారామ మందిర నిర్మాణ పూజలు ప్రారంభించారు. పూజలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 3 నెలలో ఈ నిర్మాణ పనులు పూర్తి కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

వైభవంగా రుద్రాభిషేకం



రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దూం నగర్‌లో మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం నిర్వహించిన ప్రత్యేక పూజలకు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కుత్బుల్లాపూర్: సూరారం డివిజన్ అయ్యప్ప కాలనీలోని బంగారు మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది.అభిషేకాలు తదితర పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జంగారెడ్డి, హనుమంత్‌రెడ్డి, హనుమంతరావు, మల్లికార్జున్, నిఖిల్ రెడ్డి, అంజి రెడ్డి, శివకుమార్, కాంగ్రెస్ నిజాంపేట్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



హెల్త్ క్యాంప్‌లో పాల్గొన్న బీజేపీ నేత భరతసింహారెడ్డి తదితరులు

చింతల్: ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ప్రాణధార సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన శిబిరంలో డయాబెటీస్, బీపీ, గుండె సంబంధిత ఈసీజీ, ఇతర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అదే విధంగా గాజుల రామారం చిత్తారమ్మ ఆలయంలో ఎస్.ఎస్.కె పట్కార్ ఖాత్రి సమాజ్ ఆధ్వర్యంలో 130 మందికి జరిగిన సామూహిక ఉపనయనంలో భరతసింహారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమాల్లో వీరారెడ్డి, నార్లకంటి ప్రతాప్, పెద్దింటి సాయిలు, సందీప్ గౌడ్, శ్రీనాథ్, శ్రీకాంత్ రెడ్డి, మహేష్ గౌడ్, మహేష్, ఈశ్వర్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామ నిర్మాణం పూర్తయ్యేనా?

- నిధుల లేమితో మధ్యలోనే నిలిచిన పనులు
- మూడేళ్లుగా ముందుకు సాగని నిర్మాణాలు



చింతల్: చింతల్ సబ్ స్టేషన్‌ను అనుకుని ఉన్న శ్మశాన వాటికలో వైకుంఠధామం ఏర్పాటుకు 2022లో రూ.1.60 కోట్ల నిధులతో పనులకు శ్రీకారం చుట్టారు. సదరు నిధులను విడుదల చేయడంలో అధికారులు జాప్యం చేయడంతో పనులు నిలిచిపోయాయి. దీనికి తోడుగా పనులు తగ్గించుకున్న కాంట్రాక్టర్ సైతం నిర్లక్ష్యంగా పనులు కొనసాగిస్తుండటంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిర్మాణంలో నాణ్యత లోపిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నిలిచిన పనులు

చింత శ్మశాన వాటికలో రూ.1.60 కోట్ల నిధులతో చేపట్టిన వైకుంఠధామం నిర్మాణ పనులు సగం వరకే పూర్తి చేసి మధ్యలో వదిలేశారు. నిధులు విడుదల చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారని చింతల్వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైకుంఠధామం పనులు సగభాగం వరకే పూర్తి కావడంతో దహన సంస్కారాలకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్నానాల గదులు లేకపోవడంతో ఆరుబయటే స్నానాలు చేస్తుండటంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. దహన సంస్కారాలు చేసుకున్న ప్రతిసారి బయటి నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకువచ్చి స్నానాలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా పనులు పూర్తి చేసేలా నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.





అసంపూర్తిగా దుస్తులు మార్చుకునే గదులు

చేపల మార్కెట్లు కిటకిట

మృగశిర కార్తెతో ఉదయం నుంచే బారులు తీరిన కొనుగోలుదారులు





చేపల కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్

నిజాంపేట్: ప్రతి సంవత్సరం మృగశిర కార్తె పర్వదినం ప్రజలకు ఓ పండుగవలె ఉంటుంది. ఈ రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని ప్రజల విశ్వాసం. ఉబ్బసం, ఆయాసం ఉన్న వారికి ఈ చేపలు ఎంతో మంచిదని పెద్దలు చెబుతుంటారు. ఆదివారం మృగశిర కార్తె సందర్భంగా పలు చేపల మార్కెట్లు వినియోగదారులతో కిటకిటలాడాయి. చేపల మార్కెట్‌కు మృగశిర కార్తె సందర్భంగా వందలాది రకాల చేపలు రావడంతో విక్రయదారులతో మార్కెట్‌లన్నీ కళకళలాడాయి. మార్కెట్‌కు పెద్ద ఎత్తున చేపలు దిగుమతి అయినా కూడా ధరలు ఏమాత్రం తగ్గలేదు. గత ఏడాదికన్నా మరింత పెరిగాయి. రవ్వ, బొచ్చ, కొర్రమీను, టంటం, పాంప్లెట్, బంగారు తీగ వంటి పలు రకాల చేపలతో పాటు రొయ్యలు, పీతలు దిగుమతి అయ్యాయి. దీంతో ప్రజలు పెద్ద ఎత్తున చేపలు కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు.

పేదలకు సేవలందించడమే లక్ష్యం



పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

రంగారెడ్డినగర్: పేద ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా రవితేజ ఫౌండేషన్ పని చేస్తోందని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జింకల వెంకటేష్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి పంచశీల కాలనీలోని రవితేజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రివైవ్ హాస్పిటల్ (ఐడీపీఎల్) సౌజన్యంతో ఫౌండేషన్ కార్యాలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ టి.రవికుమార్, డాక్టర్ టి.సాయిబాబా సుమారు 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం వారికి ఫౌండేషన్ సభ్యులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోత రాజేశ్వర్, సూర్యనారాయణ, రమణారెడ్డి, రమేష్, ప్రభాకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న హిందువులు



నిజాంపేట్: 352వ హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. భారతదేశంలో హిందువులందరూ అరబ్, మొగల్ మతోన్మాద ఇస్లాం పాలకుల దారుణాలకు దిక్కుతోచని స్థితిలో ఉండేవారని నాయకులు అన్నారు. అలాంటి పరిస్థితిలో ఒక ఆశాకిరణంలా జన్మించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ హిందూ మహా సామ్రాజ్య పట్టాభిషేకం జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి రోజును హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రగతినగర్ కోతి బొమ్మల సెంటర్ నుంచి వివిధ రహదారుల గుండా శోభాయాత్ర జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ ఎం.ఆర్.రాజు, మధుజీ, కంతేటి సుబ్బారావు, సత్య కాటేపల్లి, రచ్చ చక్రధర్, లక్ష్మీ రామారావు, భిక్షపతి యాదవ్, శేషారావు, నరేంద్ర చౌదరి, శ్రీనివాస్‌గుప్తా, దాసి నాగరాజు, భారతి, శిల్ప, కల్యాణి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో కార్యకర్తలు ముందుండాలి



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

- మోదీ పాలనలో అనేక సంస్కరణలు
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలు విసుగుత్తారు
- ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలు పరిష్కరించేలా బీజేపీ శ్రేణులు కృషి చేయాలని ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొంపల్లిలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా సమావేశం జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు మల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడారు. నేడు దేశం మొత్తం ప్రధాని మోదీ పాలన గురించే చర్చించుకుంటోందని, ఆయన తీసుకున్న వీరోచిత నిర్ణయాలతో విదేశాలు సైతం నివ్వెరబోయాయన్నారు. గతంలో పాలన చేసిన బీఆర్‌ఎస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాల తీరుపై రాష్ట్ర ప్రజలు విసుగు చెందారని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఓబీసీ ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, రాష్ట్ర మాజీ బీసీ కమిషన్ చైర్మెన్ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేష్, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, కొంపల్లి అధ్యక్షుడు సతీష్‌సాగర్, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతల్: మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ఐడీపీఎల్ సబ్ స్టేషన్ విజయ్ ఎలక్ట్రికల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మెగా ఇంజినీరింగ్ లైన్, ఐడీఏ బాలానగర్, టీఐఈ బాలానగర్, పంప్ హౌస్ ఫీడర్ పరిధిలో పంప్ హౌస్, శ్రీ సాయినగర్, సోనీ కాంప్లెక్స్, సాయిరామ్ హోటల్ తదితర ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపు, ఏబీ స్విచ్ రిపేర్లు చేపట్టనున్న కారణంగా పైన పేర్కొన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



గాంధీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు వేస్తున్న అధికారులు

రంగారెడ్డినగర్: రెండేళ్లుగా ఆ బస్తీ ప్రజలు రాకపోకలకు సాగించేందుకు పడిన కష్టాలకు ఎట్టకేలకు పరిష్కారానికి నోచుకున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డు నెంబరు 2, శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఆనుకుని ఉన్న రోడ్డు నెంబరు 3, 7 లలో రెండేళ్ల క్రితం భూగర్భ డ్రైనేజీ లైన్‌ను ఏర్పాటు చేసేందుకు జలమండలి ఆధ్వర్యంలో రోడ్లను తవ్వి పనులు పూర్తి చేశారు. అయితే రోడ్లను పునరుద్ధరించడం జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టాల్సి ఉండగా తాత్సార్యం చేశారు. ఈ విషయమై సాక్షిలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన జీహెచ్‌ఎంసీ ఆదివారం సీసీ రోడ్ల పనులు చేపట్టారు. దీంతో ఎన్నో ఏళ్లుగా తాము పడ్డ ఇబ్బందులు తొలగనున్నాయని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



రోడ్డును ప్రారంభిస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

సుభాష్‌నగర్: సుపరిపాలన అందించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ మిథిలానగర్‌లో రూ. 13 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తున్నామని తెలిపారు. డ్రైనేజీ లైన్, సీసీ రోడ్డు పనులు పూర్తి కావడంతో మిథిలానగర్ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించబడ్డాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఎండీ లాయక్, ఆలేటి శ్రీనివాస్‌రావు, కుత్బుల్లాపూర్ సేవాదళ్ ఏ వింగ్ అధ్యక్షుడు విజయ్‌రెడ్డి, మిథిలానగర్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు సురేష్‌కుమార్, ధనుంజయ్‌రెడ్డి, యజ్ఞేశ్వరరావు, శివాజీ, జనార్దన్ రెడ్డి, సంపత్ రావు, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

సెల్లార్ల అక్రమ నిర్మాణానికి అడ్డుకట్టేది?

- అసలే వర్షాకాలం.. పొంచి ఉన్న ప్రమాదం
- గతంలో గోడలు కూలి మృతి చెందిన కార్మికులు
- కనిపించని అధికారుల తనిఖీలు



పేట్‌బషీరాబాద్ గంగా ఎన్‌క్లేవ్‌లో అనుమతులు లేకుండా సెల్లార్ నిర్మాణం

కుత్బుల్లాపూర్: భారీ వర్షాలతో సెల్లార్లు నిండిపోయి ఖరీదైన కార్లతో పాటు వాహనాలు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. అంతేకాకుండా విలువైన ప్రాణాలు సైతం గాల్లో కలుస్తున్నాయి. గతంలో ఈ జంట సర్కిల్లో పరిధిలో అక్రమ సెల్లార్ నిర్మాణాలు కూలి పలువురు మృతి చెందిన ఘటనలు ఉన్నప్పటికీ తాజాగా జరుగుతున్న సెల్లార్ తవ్వకాలపై అధికారులు దృష్టి సారించకపోవడం విశేషం. ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో వీరి హడావిడి అంతా అంతా కాదు. అన్ని శాఖల అధికారులు చేరి సెల్లార్ నిర్మాణానికి అనుమతి లేదని.. అసలు పర్మిషన్ తీసుకోలేదని.. ఫైర్ సేఫ్టీ లేదని ఇలా అనేక రకాలుగా తప్పులు వెతకడమే పనిగా పెట్టుకున్నారు. కానీ సెల్లార్ తవ్వకాల దశలోనే వాటిని అరికట్టాల్సిన అధికారులు డబ్బులు తీసుకొని చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

> వర్షాకాలం వచ్చిందంటే చాలు అక్రమ సెల్లార్లు నీటితో నిండిపోతున్నాయి. ప్రతి ఏటా వచ్చే వర్షాలతో ఆయా ప్రాంతాల్లో భారీ భవనాలు నిర్మించే క్రమంలో నిర్మాణదారులు అక్రమ సెల్లార్ తవ్వి.. అధికారుల కంట కనబడకుండా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకునే వరకు మూసి ఉంచి, ఆ తర్వాత తెరవడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇబ్బడి ముబ్బడిగా ఇలాంటి అక్రమ సెల్లార్ నిర్మాణాలు వర్షాకాలం వచ్చిందంటే చాలు వెలుగులోకి వస్తున్నాయి.

సెల్లార్లు చెరువులను తలపించేలా..

జంట సర్కిళ్ల పరిధిలో అక్రమ సెల్లార్ ద్వారా నిర్మాణాలు చేపట్టిన ప్రాంతాల్లో భారీ వర్షం పడ్డ ప్రతిసారి సెల్లార్లు చెరువలను తలపిస్తున్నాయి. ఈ క్రమంలో సంబంధిత శాఖ అధికారులు హడావిడి చేయడం ఆ తర్వాత మర్చిపోవడం పరిపాటిగా మారుతూ వస్తుంది. ముఖ్యంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో గోదావరి హోమ్స్ పరిసర ప్రాంతాల్లో అక్రమ సెల్లార్లు వర్షం పడ్డ ప్రతిసారి మునిగిపోతున్నాయి. అదేవిధంగా పేట్ బషీరాబాద్, అంగడిపేట్ ప్రాంతాల్లో ఉన్న సెల్లార్లు చెరువులు తలపిస్తుంటాయి. మీనాక్షి కాలనీకి వెళ్లే దారిలో ప్రధాన రోడ్డు మొత్తం నీటమునుగుతాయి. ఇలా చెప్పుకుంటూ పోతే చింతల్ ప్రాంతంలో ఇదే సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో కళావతి నగర్, సూరారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమ సెల్లార్ నిర్మాణాలు వర్షం పడ్డ ప్రతిసారి ప్రమాదకరంగా మారుతున్నాయి. గత సంవత్సరం కురిసిన వర్షాలతో గ్రేటర్ కమిషనర్ ఆదేశాలతో అక్రమంగా సెల్లార్లు నిర్మాణం చేపట్టిన ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. అంతేకాకుండా వారి వద్ద నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి సెల్లార్లో విద్యుత్ ప్యానెల్ బోర్డు ఏర్పాటుతో పాటు గదులను నిర్మించిన విషయం వెలుగులోకి రావడంతో వాటికి సైతం అదనంగా డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం.

ప్రాణాలు గాలిలో కలుస్తున్నా పట్టింపులేదు

గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలతో గాయత్రినగర్ ప్రాంతంలో అక్రమ సెల్లార్ నిర్మాణ సమయంలో గోడ కూలి ఓ కార్మికుడు అందులో ఇరుక్కున్నాడు. సుమారు 8 గంటల సేపు ప్రత్యేక బృందం కష్టపడి బయటకి తీసుకువచ్చారు. అదే విధంగా ఐదు సంవత్సరాల క్రితం సెల్లార్ నిర్మాణ పనులు చేస్తున్న ఇద్దరు కార్మికులు మట్టి పెల్లలు మీద పడటంతో పేట్‌బషీరాబాద్ ప్రాంతంలో ఇద్దరు మృతి చెందారు. నిజాంపేట్ ప్రాంతంలో రెండు సంవత్సరాల క్రితం ఓ భారీ నిర్మాణదారుడు సెల్లార్ తవ్వకాలు చేపడుతుండగా పక్కనే ఉన్న ప్రహరీ కూలడంతో సుమారు నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఏదైనా ఫిర్యాదు రాగానే వెంటనే చర్యలు తీసుకోవల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే నోటీసులు జారీ చేసి అందిన కాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు అక్రమ సెల్లార్ తవ్వకాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

ఇప్పటికే నోటీసులు జారీ చేశాం



అక్రమ సెల్లార్లు గుర్తించి వాటికి నోటీసులు జారీ చేశాం. వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోకుంటే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. గతంలో కొన్ని సంఘటనలు జరిగాయి. వాటిని దృష్టిలో పెట్టుకొని సర్కిల్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో చర్యలు తీసుకుంటున్నాం. సెల్లార్లు నిర్మించడమే కాకుండా వాటిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, గదులు, వాహనాల పార్కింగ్ చేపడుతున్న విషయం గుర్తించాం. తప్పకుండా ఫిర్యాదులు వచ్చిన ప్రతి నిర్మాణంపై దృష్టి సారిస్తున్నాం.

– నరసింహ, ఉప కమిషనర్ కుత్బుల్లాపూర్